ఉద్దేశాలు మంచివే!

ఆంధ్రదేశంలో ఒక జిల్లా ముఖ్య పట్టణంలో బస్‌స్టాండ్‌నుంచి కాలేజికి వెళ్లేదారిలో సూర్య చంద్ర లారీ సర్వీసు షెడ్ ఉంది. సామాన్యంగా బస్‌స్టాండ్‌కీ, కాలేజికి మధ్య పయనించే ప్రజలు ఎంత తొందర పనిలోఉన్నా ఎంత పరధ్యానంగా నడుస్తున్నా ఆ సూర్య చంద్ర లారీ సర్వీసు దగ్గిరికి వచ్చేసరికి ఓ మారు ఉలిక్కిపడి చుట్టూచూసి ముందుకి సాగుతారు. దానికి కారణం లేకపోలేదు. మీదనించి లారీ వెళ్ళినా దులుపుకుని కదిలిపోయే ప్రొఫెసరునైనా విలవేయగల ఒక చిత్రమైన ధ్వని అక్కడ సంధ్యవేళలలో వినిపిస్తూంటూంది. ఇదీ అని స్పష్టంగా చెప్పలేంకాని డోలూ, సన్నాయీ బాంజో, మాండలిన్, గిటార్, పియానో ఒక్క మారు మోగిస్తే వచ్చే ధ్వనిని పోలిఉంటుంది అది. రాక్షసులు వసంతోత్సవాలలో తేలుతున్నారో, దేవతలు సమరోత్సాహంలో మునిగిఉన్నారోనని పథికులని అక్కజపరచే ఆ నాదం (ఆర్తనాదం కాదు) పుట్టు పూర్వోత్తరాలు అతి సామాన్య మైనవి.

మధ్యలో మొదలుపెట్టి వెనక్కి వెళ్ళడం మోడరన్ టెక్నిక్ కనక అసలు కథ ఇప్పుడు మొదలు పెడతాము (ఈమధ్య విద్యార్థులు కూడా ఇదే టెక్నిక్ అవలంబించి విరూపించవలసినది దత్తాంశంగా వ్రాస్తున్నారని పరీక్షాధికారులు గోల పెడుతున్నారు.) ఆ వూళ్లో కాలేజిలో ఇంగ్లీషు డిపార్టుమెంటులోనూ, హిస్టరీ డిపార్టుమెంటు లోనూ ఒక్కమారే ఖాళీలు ఏర్పడడంచూసి గవర్నమెంటు ఇంగ్లీషులోనూ, హిస్టరీలోనూ డిగ్రీలు కలిగిన ఓ నవ దంపతులను ఆవూరికి ట్రాన్స్‌ఫర్ చేశారు. ఆ అమ్మాయిపేరు లత. లతలాగే ఉంటుంది కూడా. అతనిపేరు రావు. అతను మటుకు అన్వర్థనామధేయుడుకాడు. అతనికి చాలావచ్చు. వాళ్ళు వచ్చిన వారం పది రోజులకే చాలా పాప్యులరు అయిపోయారు. అంటే పొలిటికల్ యాంగిల్‌లో కాదు. మామూలుగా లత అన్నా, రావు అన్నా "పాపం మంచివాళ్ళు" అనుకునేవారు. (పాపం ఎందుకు?)

మరోవారం అయినా అవకముందే ఓ రోజు లత మంచి హుషారుగా ఇల్లంతా సర్దడం మొదలు పెట్టింది. "ఎలాగైనా ఇల్లాలుకదా!" అనుకున్నాడు రావు హర్ష ప్రఫుల్లమానసంతో. లత నేడిపించా లనిపించిందతనికి.

"ఏం? వన్నింగ్రెప్ చెయ్యాలని చూస్తున్నావా?" అన్నాడు.

"ఊహు. మిమ్మల్నికాదు" అంది లత సీరియస్‌గా. రావుకి అర్థం కాలేదు. "మరి?"

"స్వర్ణగారిని భోజనానికి పిలిచాను."

ఒక్క నిముషంపాటు రావుకి నోట మాట రాలేదు.

"అప్పుడే మీ ఇద్దరికీ అంత స్నేహం అయి పోయిందేమిటి?"

"ఎంత సేపు కావాలి" అని లత స్వరం తగ్గించి, "చాలా మంచి మనిషండీ" అంది అతన్ని ఊడికిస్తున్నట్టు.

"అవునవును. అందులో ఈ రోజుల్లో మంచి వాళ్ళు చాలా అరుదు కూడాను" అన్నాడు రావు కించిత్ అప్రసన్నుడై. కొంచెంసేపూరుకుని, "అయితే చికెన్. . . . . ." అన్నాడు లతాభి ముఖుడై.

"నో, నో" అంది లత విముఖురాలై "ఆవిడ ప్యూర్ వెజ్ ."

"ఏం? ఈ రోజుల్లో వర్ణాంతర భోజనాలకి తప్పు లేదే."

"వర్ణాలా, కృతులా కాదేరేంటి ప్రశ్న. అంది రిదీ ఏక నలుపేకదా?" అంది లత విసుగ్గా. స్వర్ణ 'సువర్ణం'కాదు.

"పోనీ, ఏం చేస్తున్నావ్?"

"వంకాయకూర, పెరుగు వడలు, ములక్కాడ వేసి పులుసు."

నీరసంగా కుర్చీలో కూలబడ్డ రావు వంక జాలిగా చూసింది లత. వంకాయా ఓ కూరేనా? అని అతడి భావం. "ఒక్క రోజుకేకదా" పర్దుకు పోవడం నేర్చుకోవాలని లత మనవి.

"నీ గురించే నా బాధంతా" అన్నాడు రావు.

"అంటే?"

"అంటే భర్తని అర్ధాకలితో లేపిన ఆడదానికి ఊర్ధ్వలోకా లుండవంటూంటారు పెద్దవాళ్ళు."

"ఛీ. అలాటి మాట లనకండీ."

రావు నోరు మూసుకుని రేడియో, పేపరు వరసగా విప్పేడు. పాపం అవేళ రావుకి కంచం లోంచి చెయ్యి నోటిదాకా వెళ్తే ఒట్టు.

"ఏవండీ? ఒంట్లో బాగులేదా? అలా ఉన్నారేం?" అంది స్వర్ణ వివర్ణమైన అతడి మొహం చూసి.

"ఏంలేదండీ. ఏదో జ్ఞాపకం వచ్చింది. శ్రీనాధుడు గరళకంఠుడ్ని సవాలు చేశాడట విషం తాగేనని వి(రవీగుతావుకాని పలనాట బచ్చలిశాకం పులుసుతో జొన్నకూడు మింగు చూద్దాం అని."

లత తీక్షణంగా చూసింది రావువేపు. రావు గబుక్కున మంచినీళ్ల గ్లాసందుకున్నాడు. కష్టాలెప్పుడూ మంచివాళ్ళకే వస్తాయిట. (కష్టాలొచ్చాయంటే మంచి వాళ్ళయి ఉండాలిట) లేకపోతే రావు ఇలా అభోజనంగా ఉండనుకాక ఉండనని మొండిపట్టు పట్టి ఉండేవాడు. లత ఇలా అవమానంపాలై ఉండేదికాదు (పతిదేవుని మూలంగా) స్వర్ణ ఆహార వ్యవహారాల దగ్గిర తనతో పొసగని వాళ్ళతో స్నేహంచేసి ఉండేదికాదు. అన్నిటికి వాళ్ళ వాళ్ళ మంచితనమే కారణం. సూక్ష్మంగా ఆ ముగ్గురూ ఆ సమయంలో ఆలోచిస్తున్న వాటి సారాంశం ఇది.

భోజనాలు అయేకా (అవకుండానూ) అందరూ వచ్చి డ్రాయింగ్‌రూమ్‌లో కూచుని ఆకులు వేసుకుంటుండగా—

"మీకు సంగీతం వచ్చునా?" అని లత స్వర్ణని అడిగింది.

"రాదు. మరి మీకు వచ్చునా?'

"నాకూ రాదు."

అక్కడితో ఆ సంభాషణ అయిపోవలసిందేకాని తెలుగు నవలలా, తెలుగు సినిమాలాగ అయిపోయి నట్టే అయిపోయి మళ్ళీ తలెత్తింది.

"నేర్చుకుందామా?" అంది స్వర్ణ.

రావు బిక్కు బిక్కుమంటూ లతవేపు చూశాడు. "తప్పకుండా" అంది లత ఆనందోత్సాహాలు వదనంలో వెల్లివిరుస్తుండగా. లతకి అతిధులని ఎలా ఆదరించాలో తెలుసు అనుకున్నాడు రావు ఆనందంగా.

నాలుగు రోజులు పోయేక లత రావుతో "కాకివారి వీధిలో వెంకటశాస్త్రిగారని ఒక సంగీతం మేష్టరున్నారుట. వెళ్ళి తీసుకురండి" అంది.

"అదేవిటి?" అన్నాడు రావు కొత్తగా చూస్తూ.

"తెలీనట్టు నటించకండి. మీముందేకదా స్వర్ణ, 'వేమా నేర్చుకుందాం' అని నిశ్చయించుకున్నది" అంది లత.

"ఊరికే అన్నావనుకున్నాను"

"కాదులెండి" అంది లత కొంచెం కఠినంగా.

రావు సరేలే అన్నాడు. రాత్రి "కనుక్కున్నారా" అనడిగితే లేదన్నాడు. మర్నాడూ అదే ఆన్సరిచ్చాడు. మూడోరోజు ధైర్యం వహించి, "ఇప్పుడు సంగీతం నేర్చుకోకపోతే ఏం లతా?" అన్నాడు నెమ్మదిగా.

అతనికి సంగీతం అంటే అంత కోపంలేదుకాని ఎమెచ్యూర్స్‌ని సహించలేడు. శాస్త్రీయ కచేరీలు అర్ధంకావు. అంచేత అతను వినగలిగిందల్లా రేడియోల్లో లలిత సంగీతమూ, సినిమాల్లో శాస్త్రీయ సంగీతమూను. పెళ్ళిచూపులనాడే "మీ అమ్మాయి పాడదుకదా, పాట నేర్చుకుంటానని పేచీ పెట్టదుకదా" అని అడగలేదే అని విచారించవలసిన రోజొచ్చింది ఆతని జీవితంలో ఆఖరికి.

లత క్షణం వూరుకుని "సరేలెండి" అంది. కాని అది నాలిక చివర్నుంచి వచ్చింది.

మర్నాడు కాలేజిలో స్వర్ణ "కనుక్కున్నారా?" అని ప్రశ్నించింది లతని.

"లేదు. ఇవాళ కనుక్కుంటానన్నారు" అంది లత.

"నేను వీణకి వ్రాశాను" అంది స్వర్ణ "రెండు రోజుల్లో జవాబు రావచ్చు."

లతకేం చెప్పాలో తెలీలేదు. స్వర్ణ సరదా చూస్తుంటే లతకి హుషారొస్తూంది. అటు రావు తీరు చూస్తే నీరుకారిపోతూంది. "నిజంగా నా

నిడదవోలు మాలతి

అభిప్రాయం ఏవిటో నాకు తెలీడంలేదు" అని తనలో తనే సణుక్కుంది.

ఆ రాత్రి మళ్ళీ రావు దగ్గిర "ఆ విషయం ఎత్తకుండా వూరుకోలేకపోయింది.

"స్వర్ణ వీణ మేకర్‌కి ఉత్తరం వ్రాశారుట" అంది.

రెండు రోజులు పోయాక స్వర్ణకి జవాబు వచ్చింది అని బులెటిన్ తెచ్చింది. మూడోరోజు బులెటిన్: వీణ మేకర్ ఆదివారం వూళ్లో దిగుతాడని.

ఆఖరికి రావు విసుగ్గా "నువ్వు ఈ సంగీతం ఆపుతావా? నన్ను సన్యాసం పుచ్చుకోమన్నావా?" అన్నాడు.

లత హరిణలోచనాలతో అతనివేపు చూడడం చూసి, "అదికాదు. నన్నేం చెయ్యమంటావు చెప్పు?" అన్నాడు మందర స్థాయిలోకి దిగి.

"ఓహ్! మీరది ఒక ప్రొపొజల్‌గా అంటే కన్సిడర్ చెయ్యొచ్చు. మీరు గ్రహించారో లేదో సంగీతానికీ, సన్యాసానికీ కూడా పన్నెండేళ్లే సాధన నిర్ణయించేరు ఆర్యులు" అంది లత కుదుటబడి.

"ప్రభుత్వాన్ని పన్నెండేళ్ళు లీవ్ అడగనా?" (హేళనగా)

"ఇవ్వరు దాబోలు"— (దిగులుగా)

"దానికేముంది? ఎక్స్‌ప్షన్‌గా కన్సిడర్ చెయ్యమందాం. వ్రాస్తాను— మా ఆవిడ సంగీతం నేర్చుకుంటుందిట. ఆ కాలపరిమితిలో నేను సన్యాసాశ్రమం చవిచూడాలనుకుంటున్నాను అని. అది ప్రిరిచ్యూల్‌స్టడీ కవక స్టడీ లీవ్‌కింద ఇచ్చినా ఇవ్వొచ్చు" (మళ్ళీ హేళనగానే)

"అయినా ఇవ్వం అంటే. . . . ?" (ఇంకా దిగులుగా)

"అప్పుడేనా ఈ రికార్డు ఆపుతావా?"— (కఠినంగా.)

". . . . ."— (నిస్సహాయంగా)

ఇలాటి సంభాషణలు అవుతుండగానే ఆదివారం వచ్చేసింది. దాంతోపాటు స్వర్ణ, స్వర్ణ వెనక వీణ మేకరూ, ఆ మేకర్‌తో వీణా రావుగారింటి కొచ్చేశారు.

"బాగుందండి?" అంది స్వర్ణ.

"బాగానేఉంది" అన్నాడు రావు. లతకి వీణ చూస్తున్నకొద్దీ ముచ్చటేసింది. సన్నని దంతపు బోర్డరు చుట్టూ వేశాడు. ఫినిష్ మెరిసిపడిపోతూంది. మేళంచేసే తీసుకువచ్చాడు.

"ఇక్కడ ఉంచమన్నానండి. మీరు సాయంత్రం ఆ వీణ మేష్టర్ని పిలిస్తే, ఆయనకి కూడా చూపించి డబ్బిచ్చేస్తా నన్నాను." అంది స్వర్ణ.

"అలాగే. చెప్తాలెండి" అన్నాడు రావు. వాళ్ళు వెళ్ళిపోయాక రావు లతవేపు తిరిగి, "మీ చదువుకున్న ఆడవాళ్ళతో గెలవడం కష్టం సుమా" అన్నాడు. లత వీణవేపునుంచి దృష్టి మరల్చకుండానే "లేటుగా తెలుసుకున్నారు" అంది.

"ముందే తెలుసు"

"మరెందుకు చేసుకున్నారు?"

"నేను మొదటే చెప్పాను మా అమ్మతో— "నాకు చదువుకున్నవాళ్ళు వద్దూ, 'చాకలినా డొచ్చాడు పద్దు చూడండ'ని కాలేజీకి రాకుండా ఉంటే చాలూ అని. మా అమ్మే "ఈకాలపు చదువులలాగే ఉన్నాయీ. దానికైనా యమ్మే ఉండాలీ" అని నిన్ను తీసుకొచ్చింది" అన్నాడు రావు.

"మీ దగ్గిరే కదండీ చదువుకున్నాను" రావు లతకి బి. ఎ. లో ఇంగ్లీషు చెప్పాడు. ఆ సంగతి మర్చిపోయాడు.

రెండు నెలలు తిరగకుండా రావు వీణ విశ్వనాథానికి శాస్త్రోక్తంగా పంచెలచాపూ, తాంబూలం, రెండువందల రూపాయలూ అర్పించుకుని లత చేత "నా వీణ" అనిపించేడు. లత సంతోషం చూశాక అతను కూడా నేనెంత దుర్మార్గుణ్ణి, కాకపోతే ఆ పిల్ల నలా క్షోభ పెడతాను అనుకుని తన్ను తాను నెన్ను చరుచుకున్నాడు చేసిన సత్కార్యానికి. కాని రోజూ సాయంత్రవేళ సంగీతం మేష్టరు వచ్చేవేళకి ఇంట్లో ఉండడం మటుకు అతని శక్తికి మించిన పనయింది. అదే కారణం వల్ల అతను మార్నింగ్ వాక్ కూడా అలవాటు చేసుకొన్నాడు. "పోనీ పాపం" అని లత కోపం తెచ్చుకోకుండా వూరుకుంది. రోజులలాగే జరిగిపోతే కధలు ఎక్కడి వక్కడే నిలిచిపోతాయి. కాకినాడ పాలిటెక్నిక్‌లో లెక్చరర్‌గాఉన్న సారధి కలకత్తానుంచివస్తూ దారిలో చెల్లెల్నిచూసి పోదాం అని దిగేడు. అన్నగారినిచూసి లత చాలా సంతోషించింది. సారధి వస్తూ వస్తూ ఓ టేప్ రికార్డరు కూడా తెచ్చాడు. "వెయ్యి. చూద్దాం" అంటే, దానికేవో మైనర్ ఎడ్జెస్ట్‌మెంట్సు చెయ్యాలి, వీల్లేదు పొమ్మన్నాడు.

31 వ పేజీ చూడండి

వారం రోజులు అందరూ సరదాగా గడిపేరు. వెళ్ళేరోజుకి ముందురోజు సారధి రావుతో "బోలెడు గొప్పలు చెప్తావుకాని రాకరాక వచ్చిన బావమరిదిని సన్మానించడానికి ఓ పార్టీయేనా పెట్టేవుకాదు" అన్నాడు నిరుత్సాహంతో కూడినవాడై.

"అయ్యో! అంత మాత్రానికే చిన్నబుచ్చుకోవాలా? మాట మాత్రం అంటే పార్టీలేం ఖర్మ, డిన్నర్లూ, డ్యాన్సు ప్రోగ్రాములూ అరేంజి చెయ్యక పోయానా? పోన్లే. రేపు నలుగుర్ని పిలిచి భోగి పళ్ళు పోయిస్తానుండు" అన్నాడు రావు వోదారుస్తూ. అన్నట్టుగానే నలుగుర్ని పిలిచాడు. అందరూ కబుర్లు చెప్పుకుంటూ లత చేసిన స్పెషల్స్ ఖర్చు చేస్తున్నారు.

ఇంతలో పక్క గదిలోంచి ఉఫ్‌మని, గీమని శబ్దం వచ్చింది. "శ్రోతలారా! ఇప్పుడు మీరు వీధినాటకం వింటారు. . . . . ."

లత సారధివేపు తిరిగి, "ఎడ్వెర్టైజ్‌మెంట్సు కావాలన్నావు" అంది.

"ఊఖ్కర్లేదు కాబోలయితే" అన్నాడు సారధినవ్వి.

". . . . . .ఇప్పుడు మీరు లతారావుగారి కచేరి వింటారు." అని రావు గొంతు వినిపిస్తోంది.

"లతారావు ఏమిటి? మీరు కూడా వాయిస్తారా?" (లత గొంతు)

"సరే. లతాదేవిగారు ఇప్పుడు జంట స్వరాలు వాయిస్తారు" (రావు)

"నేను కృతి వాయిస్తాను" (లత గొంతు)

"సరే. లతాదేవిగారు ఇప్పుడు "చలమేల చేశావు" అనే కృతి వాయిస్తారు. దర్బార్ రాగం. ఆది తాళం" (రావు గొంతు)

"అది కృతికాదు. వర్ణం" (లత)

"అయ్యో! ఇంతసేపూ జరిగింది నాటకం. ఇప్పుడు శ్రీమతి లతాదేవిగారు వాయించేది వీణ." (రావు)

ఒక్క క్షణం నిశ్శబ్దం.

"సా......పా......సా......"

"అదేమిటి?" (రావు)

"మా మేష్టారు చెప్పారు ముందు సాపాసా వాయించమని" (లత)

"కానియ్" (రావు)

కొన్ని క్షణాలు నిశ్శబ్దం.

మళ్ళీ టింగ్... టింగ్... టింగ్... అని వినిపిస్తోంది కొంచెంసేపు.

"ఆపేశావేం?" (సారధి)

"ఇప్పుడు వైలనిస్టు ఛాన్సు" (లత)

"అదెక్కడ తేవడం. అనకాపల్లి నూకాలమ్మ జాతరలో నా మేనల్లుడు కొన్న డప్పులబండి ఉంది కావలిస్తే." (రావు)

"అన్నయ్యా! పకోడీలలో జీడిపప్పు వెయ్యనా, ఉల్లిపాయ లెయ్యనా?" (లత)

"దిట్టంగా పచ్చి మిరపకాయలు వెయ్యి— జన్మలో మర్చిపోకుండా." (రావు)

కొన్ని క్షణాల నిశ్శబ్దం.

"ఆరుద్ర రచించిన 'దేవుని ఎదుట' నాటిక వింటారు. కవి కుమారుడి ఆత్మ ఘోష వినండి" (రావు గొంతు)

సారధి గొంతు వినిపిస్తోంది. "నా యిష్టం. నా ఇష్టమొచ్చినట్టు వ్రాస్తా. నా కళ్ళ కేది కనబడితే దానిమీద రాస్తా. ధనరాసులప్రక్క దారి

ఉద్దేశాలు మంచివే!

21 వ పేజీ తరువాయి

ద్ర్యం—సుజ్ఞానపు క్షేత్రంలోనే అజ్ఞానపు బ్రహ్మజెముడు డొంకలు, ఆ ప్రక్కనే నిరాశ—ఆనందం ప్రక్కనే ఆక్రందనం— అడుగడుగునా విఘ్నాలు ఆశలకు అవాంతరాలు—ఆశయాలకు ఆనకట్టలు, ఆవేశాలకు చన్నీళ్ళు— అభిప్రాయాలకి సంకెళ్ళు ఆలోచనలకి బేడీలు— ఆదర్శాలకి ఉరితాడు, ఉత్సాహానికి కంట్రోలు, ఉద్రేకాలకి రేషను—ఇహంలో నో వేకెన్సీ—పరంలో నో ఎడ్మిషన్—కళ్ళకు కటకటాలు కడుపులోకి కంకర, తలరాతలు వంకర. . . . .

"టింగ్. . . . .టింగ్. . . ." మళ్ళీ వీణ విన్పిస్తోంది.

రావు గొంతు "సరిమాపద. . . . సరిపద. . ." పదా. . . . . . .పదా. . . . . ."

సారధిగొంతు "ఎక్కడికోయ్?"

. . . .

లత వెళ్ళి గుప్ చప్‌గా మెయిన్ స్విచ్ ఆఫ్‌చేసి రావడంతో ఆ భాగవతం పరిసమాప్తమయింది. అతిథులంతా వెళ్ళిపోయాక "నాకు తెలీకుండా నేను మాటాడినవన్నీ రికార్డు చేశారుకదూ!" అంది పరిదీనవదనయై.

"ఏం వైపోయిందిప్పుడు?" అన్నారు ఇద్దరూ నవ్వి.

ఆ మాటకొస్తే లత వాయించిన వాయింపుల మధ్యలో 'యిరేస్' చేసి రావు వాయించేడని లతకి తెలీదు కనక అడగలేదు.

మర్నాడంతా లత చాలా ముభావంగా ఉంది. దానికి కారణం ఆ సాయంత్రం లత రావుని "నిజంగా నా వాయింపు అంత ఘోరంగా ఉంటుందండీ?" అని అడిగేవరకూ తెలీలేదు. రావుకి జాలేసింది. నిజం చెప్పేద్దాం అనుకున్నాడు. కాని నిజం చెప్తే తన కార్యం సాఫల్యంకాదని జ్ఞాపకం వచ్చింది.

"అబ్బే, మరీ అంత యిదిగా ఉండదనుకో. నువ్వింకా ఏమెచ్యూర్‌వి కదా. అందుచేత. . . ." అన్నాడు దేశీయ తటస్థ విధానాన్నవలంబిస్తూ.

"అవునవును. ప్రాక్టీసు చాలదు. ఇంకా బాగా ప్రాక్టీసు చెయ్యాలి" అంది లత.

పాపం! రావు అప్రతిభుడై పోయిన సంగతి లత చూడనేలేదు. ద్విగుణీకృతోత్సాహంతో లత స్వర్ణాల ప్రాక్టీస్ సాగిపోతూంది. ఆనాటినుంచి. ఆ వీణల కల కలలే ఆ రోడ్డున వినిపించే గర గరలు.

కావలిస్తే కాలేజి రోడ్‌మీద సాయంసమయంలో షికారుగా వెళ్ళి చూడండి సూర్య చంద్ర లారీ సర్వీస్ షెడ్స్ ఇప్పటికీ కనిపిస్తూనే ఉంటాయి!! ★

"బ్రదర్! నా మాట విను నాలాగే నువ్వు కూడా ఓ పడుచు పనిమనిషిని యింట్లో పెట్టు. మీ ఆవిడ నువ్వు పొమ్మన్నా మరి నిన్ను వొదిలి సినిమాలకేగాదు బజారుకేనా వెళ్ళదు."